క్లుప్తంగా

ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయండి

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీఎంకేజేఎఫ్ ద్వితీయ ప్లీనరీ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అడప సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

నిరుపేద కుటుంబానికి సర్పంచ్ చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

రెబ్బెన: రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ ఆర్థిక సాయం చేశారు. గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడు తీపుల రెడ్డి కూతురు పల్లవి పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆదివారం రూ.11,016 ఆర్థిక సాయం అందించారు. నాయకులు సంజీవ్‌జైస్వాల్, రంగు శ్రీనివాస్‌గౌడ్, ఇంగు మల్లేశ్, పూదరి తిరుపతి, పూదరి శంకరయ్య పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో పూజలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసం కావడంతో ఆలయంలో భక్తుల సందడి కన్పించింది. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బీజేపీలో చేరిన మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



శ్యామ్‌రావును సన్మానిస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో బీజేపీలో చేరిన కాగజ్‌నగర్ చింతగూడకు చెందిన మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావును బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఆదివారం పార్టీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్, జిల్లా కోశాధికారి అరుణ్, కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి మందాడే సుధాకర్, మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దహెగాంలో వర్షం



దహెగాం: మండలంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురువడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. భారీ వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పత్తి, వరి పంటలకు జీవం పోసినట్లయిందని పేర్కొంటున్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మొరం రోడ్లు బురదమయంగా మారడంతో గ్రామీణవాసులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

టెట్ పేపర్ -1 నమూనా పరీక్షకు స్పందన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెట్ పేపర్ –1 (మోడల్ టెస్ట్ 4) నమూనా పరీక్షకు స్పందన లభించింది.

10న పంచాయతీ కార్యాలయం ప్రారంభం

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయం భవనాన్ని ఈనెల 10న ప్రారంభించనున్నట్లు సర్పంచ్ రాథోడ్ సావీందర్ ఆదివారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ కనక మోతుబాయిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

కురిసిన వాన..మురిసిన రైతు

- విస్తారంగా కురుస్తున్న వానలు
- పంటలకు జీవం



పెంచికల్‌పేట్‌లో సాగు చేసిన పత్తి పంట

పెంచికల్‌పేట్/కెరమెరి: రైతులను వాన కరుణించింది. నెల రోజులుగా వానలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. వర్షం లేక పంటలు ఎండుతున్న నేపథ్యంలో వాన కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వర్షం పడడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు పత్తి, వరి, సోయాబీన్ పంటలు సాగు చేశారు. డివిజన్ పరిధిలో 1,73,611 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. నెల రోజులుగా వానలు లేక పంటలు ఎండిపోతున్న క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి.

కెరమెరిలో..

కెరమెరి మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 156 గ్రామాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 6423 మంది రైతులు ఉండగా 29,000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులోఅత్యధికంగా పత్తి పంటను 22వేల ఎకరాల్లో సాగు చేశారు. కంది 5,400, పెసర 600, సోయా 150, మినుములు 150, జొన్న 200, కూరగాయలు 500 ఎకరాల్లో పండిస్తున్నారు. గతేడాది 21వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా ఈ ఏడాది మరో 1000 ఎకరాలు అధికంగా సాగు చేస్తున్నారు. కాగా గత నెలరోజులుగా వర్షం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో, చెరువుల కింద ప్రాంతాల్లో పంటలు సాగు చేసిన రైతులు మోటార్ల సాయంతో నీరందించి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. బోర్లు ఉన్న రైతులు బోర్ల సాయంతో పంట ఎండిపోకుండా చర్యలు తీసుకున్నారు. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూశారు. ఇక పంటలపై ఆశలు సడలుతున్న దశలో ఆదివారం కురిసిన వర్షం పంటలకు ప్రాణం పోసింది.

వేడిమి, ఉక్కపోతకు చెక్..

వారం రోజుల నుంచి ఎండాకాలాన్ని తలపించేలా వేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా వానలు లేకపోగా ఎండలు దంచికొట్టాయి. ఈక్రమంలో వానలు ప్రజలకు కాస్త ఉపశమనమిచ్చాయి.

పంటకు ప్రాణం వచ్చింది



ఆదివారం కురిసిన వానతో కొంతమేర పంటకు ప్రాణం వచ్చింది. ఇంకా కొన్ని రోజులు వానలు పడకుంటే పత్తి పంట రంగుమారి తీవ్ర నష్టం జరిగేది. ఇంకా వానలు కురవాలి.

– ఆత్రం బొజ్జిరావు, రైతు, చాపన్‌గూడ

నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశా..



నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట ఏపుగా పెరగలేదు. రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.

– చౌదరి భాస్కర్, రైతు, అగర్‌గూడ

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించినట్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. ఆదివారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి నార్నూర్, గాదిగూడ మండలాల్లో పర్యటించారు. గాదిగూడ మండలంలోని కొత్తపల్లి(జీ) సర్పంచ్ కొట్నాక్ బారిక్‌రావు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నార్నూర్ మండలంలోని మంజిరి గ్రామ పటేల్ రాము అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం బాబేఝరి, ఖంపూర్ రోడ్డు, వంతెలను పరిశీలించారు. మాన్కాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సడ్డంగూడ నుంచి బాబేఝరి రోడ్డు మరమ్మతుల కోసం రూ. 2 కోట్లు, ఖంపూర్ నుంచి మాదాపూర్ రోడ్డుకు రూ. 1.55 కోట్లు, గాదిగూడ మండలంలోని మారేగాం నుంచి బుద్దగూడ కొలామా వరకు రూ, 6.13 కోట్లు మంజూరు చేయించామన్నారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నార్నూర్, గాదిగూడ మండలంలోని ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ, 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, గాదిగూడ వైస్ ఎంపీపీ మోగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, సర్పంచ్ రాథోడ్ సావీందర్, ఉర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, మెస్రం మానిక్‌రావు, పెందూర్ దీపక్ పాల్గొన్నారు.

అమృత వనం నిర్మాణంలో పాలుపంచుకోవాలి



మట్టి సేకరిస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: మండలంలోని రెబ్బెన గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు 'నా భూమి –నా దేశం' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆరాధ్య దైవం మారెమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితో కలిసి మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతీ ఇంటి నుంచి మట్టిని సేకరించి అమృత వన నిర్మణం కోసం పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరవీరుల స్మారకార్థం నిర్వహించే అమృత వనం నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, సర్పంచ్ సతీశ్, వెంకటేష్, శంకర్, భీంరావు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని పోతెపల్లి గ్రామానికి చెందిన తోడిషం పోషక్క పిడుగుపాటుకు గురై మృతిచెందగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ తాళ్ల రామయ్య, మాజీ సర్పంచ్ వసీఉల్లా ఖాన్, డోకే మల్లేశ్, రాకేశ్, వెంకటేశ్, జక్కం తిరుపతి తదితరులు ఉన్నారు.

రాజీతోనే విజయం..!

- సిర్పూర్(టి)లో లోక్ అదాలత్
- పెండింగ్ కేసులకు మోక్షం



అన్నదమ్ములైన సంతోష్, సురేష్‌లకు వారసత్వంగా కొన్ని ఆస్తులు సంక్రమించాయి. పంపకాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇద్దరు శత్రువుల్లా మారారు. వారికి నచ్చజెప్పేందుకు బంధువులు, కుటుంబ సభ్యులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈలోపు ఇద్దరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఇక లాభం లేదని సురేశ్ కోర్టును ఆశ్రయించాడు. మూడేళ్ల పాటు చెప్పులరిగేలా కోర్టు చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో న్యాయవాది సలహా మేరకు లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. అంతే.. మూడేళ్లుగా పరిష్కారం కాని సమస్య వారాల వ్యవధిలోనే పరిష్కారమైంది. శత్రువులుగా మారిన అన్నదమ్ముల మధ్య మళ్లీ సత్సంబంధాలు నెలకొన్నాయి.

కౌటాల: న్యాయస్థానాల్లో కేసుల పరిష్కారానికి తీవ్ర జాప్యం జరుగుతోంది. వాది, ప్రతివాదులు కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సుముఖంగా లేక కాలయాపన చేస్తుంటారు. దీంతో డబ్బులతో పాటు కాలం వృథా అవుతోంది. కేసుల సత్వర పరిష్కారం కోసం లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం –1987 కింద లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఏటా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు.

లోక్ అదాలత్ అంటే..?

లోక్ అదాలత్ (పీపుల్స్ కోర్ట్)పై చాలా మందికి అవగాహన లేదు. కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోవడంతో వాటి సత్వర పరిష్కారం కోసం లోక్‌అదాలత్ తీసుకొచ్చారు. దీని ద్వారా ఇరువర్గాలు తక్షణ పరిష్కారం పొందవచ్చు. లోక్ అదాలత్ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్, 1987 ప్రకారం ఒక చట్టబద్ధమైన సంస్థ. పెండింగ్‌లో ఉన్న కేసులు, న్యాయస్థానంలో ప్రీ లిటిగేషన్ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక ఇది. రాజీకి అవకాశం ఉన్న కేసులను మాత్రమే లోక్‌అదాలత్‌ల ద్వారా సత్వరంగా పరిష్కరించుకోవచ్చు. ఇక్కడ ఇచ్చే తీర్పు అంతిమం. లోక్ అదాలత్ కేసు పరిష్కారం అయిన ప్పుడు అవార్డు(తీర్పు)కు వ్యతిరేకంగా ఏ న్యాయస్థానం ముందు అప్పీల్ చేయడానికి కుదరదు.

సిర్పూర్(టి)లో..

లోక్‌అదాలత్‌లపై 'గొడవలు వద్దు –రాజీలు ముద్దు' అంటూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. సిర్పూర్(టి) జేఎఫ్‌సీఎం కోర్టులో ఈ నెల 1వ తేదీ నుంచి ముందస్తు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఒకే రోజు లోక్‌అదాలత్ నిర్వహించడం వల్ల రద్దీ పెరిగి ఇబ్బందులు ఏర్పడుతాయని ముందస్తు లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధి ఆయా పోలీస్‌స్టేషన్‌లలో వందల కొద్ది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని న్యాయవాదులు సూచిస్తున్నారు. ఇరువర్గాల వారు తమ ఆధార్‌కార్డులు వెంట తీసుకురావాలని అధికారులు పేర్కొంటున్నారు.

పరిష్కారం చూపే కేసులు..

రోడ్డు ప్రమాదాలు, దాడులు చేసుకున్న కేసులు, మోసానికి సంబంధించిన కేసులు, వివాహ సంబంధ కేసులు, చిన్న దొంగతనం కేసులు, డబ్బుల రికవరీకి సంబంధించిన కేసులు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, వాటర్ సహా నాన్ కాంపౌండబుల్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

కౌటాల: లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఎస్సై ఎస్.మధుకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా సిర్పూర్(టి)కోర్టులో ఈనెల 9వ రకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులను రాజీ కుదుర్చుకోవాలని కోరారు. లోక్ అదాలత్ కేసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. వివరాలకు కౌటాల సీఐ 8712670512, ఎస్సై 87126 70543లలో సంప్రదించాలన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి'



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం సిర్పూర్ మండలం పారిగాం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు గొర్లపల్లి విఠల్, మన్నెంపల్లి విలాస్, బెడికల శంకర్‌లకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల కోఆప్షన్ మెంబర్ ఖీజర్, ఉమాజీ, ఇప్పత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు గొర్లపల్లి విఠల్, మన్నెంపల్లి విలాస్, బెడికల శంకర్‌లు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తులసీరాం, పెంటయ్య, అజీమ్‌ఖాన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు



బీఎస్పీలో చేరుతున్న తన్నీరు పోశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా అహర్నిశలు పార్టీ కోసం పనిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలను పార్టీలో చేరే విధంగా కృషి చేయాలన్నారు. బీఎస్పీలో చేరిన వారిలో తన్నీరు పోశం, హబీబ్, యసుఫ్ ఖాన్, ఇందిర, ఎండీ మహబూబ్, శేఖర్, విజయ్, సాబిర్, రమేశ్ ఉన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, తాలుకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికవాడలోకి కొండచిలువ



హతమైన కొండచిలువ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి కార్మిక వాడలోకి ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రవేశించింది. 2వ బ్లాక్ చివరి లైన్‌లోని కూడళి వద్ద రోడ్డుపై కప్పను తింటూ కొండ చిలువ కన్పించడంతో ఒక్కసారిగా కాలనీవాసులకు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానిక యువకుడు కర్రతో కొట్టి కొండ చిలువను హతమార్చాడు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

చట్టాలను గౌరవించాలి

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతలసాంగ్వీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తమ ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ సహకారం తీసుకోవచ్చని తెలిపారు. యువకులు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సిడం ప్రవళిక ఖమ్మం మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించడంతో ఆమెను సన్మానించారు. బోథ్ సీఐ భీమేష్, ఎస్సై నరేశ్, న్యాయవాదులు శంకర్, కృష్ణప్రసాద్, సర్పంచ్ ప్రకాష్, విజయ, సుదర్శన్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో గుడిసెలు కాలిపోయిన బాధితులను రెవెన్యూ శాఖ తక్షణమే ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ డిమాండ్ చేశారు. గుడిసెలు కాలిపోయిన బాధితులను ఆదివారం పరామర్శించి, అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిలో సుమారు ఆరు నెలలుగా గుడిసెలు వేసుకొన్న వీరిపై, సుమారు 200 మంది వచ్చి, దౌర్జన్యం చేసి, పెట్రోల్ పోసి గుడిసెలను కాలబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

అవగాహన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని 3వ వార్డు తిలక్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు.

అడవి పందుల దాడిలో ముగ్గురికి గాయాలు



గాయాలపాలైన వ్యక్తి

బెజ్జూర్: అడవి పందుల దాడిలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని అందుగూడ గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఊట్‌సారంగపల్లి (సలుగుపల్లి) గ్రామానికి చెందిన ఇప్ప జగదీష్, శేఖర్‌లతో పాటు మరో వ్యక్తి కలిసి ద్విచక్ర వాహనంపై కుంటలమానెపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో అందుగూడ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం అడవి పందులు అడ్డురాగా వాటిని ఢీకొట్టారు. దీంతో వారు కిందపడిపోగా, అడవి పంది వారిపై దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. గాయాలపాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

నాచుతో పొంచి ఉన్న ప్రమాదం



కెరమెరి: మండలంలోని ఇందాపూర్, ఉమ్రి గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టుపై నుంచి ప్రతీరోజు నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ నీటిలో నాచు అధికంగా ఉండి పాదాచారులతో పాటు ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు జారి పడి గాయాలపాలైన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. అధికారులు స్పందించి నాచు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : ఖుషి

కాగజ్‌నగర్
వెంకటరమణ : ఖుషి

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.40
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంత	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	80
పాలకూర	40
సొరకాయ	40
చిక్కుడు కాయ	80
గోబి(పూల్)	80
క్యాబేజి	60

–ఆసిఫాబాద్‌అర్బన్